ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
- విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతి


పోలసానిపల్లి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఘంషూద్దీన్


భీమడోలులో విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న పోలీసులు, అధికారులు

భీమడోలు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఒక్క నిమిషం ఆలస్యమైన అనుమతించేంది లేదని అధికారులు ప్రకటించడంతో విద్యార్థులంతా సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9.30 గంటలకు తెలుగు పరీక్షా ప్రశ్నాపత్రాన్ని అందించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేసారు. పరీక్షా కేంంద్రాల వద్ద పోలీసులు, విద్యాశాఖ, మహిళా కానిస్టేబుళ్లు విద్యార్థుల నుంచి ఎలక్ట్రానిక్ వాచీలను, సెల్‌ఫోన్లు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చివరి నిమిషాల్లో కొందరు విద్యార్థులు పరుగులు తీసారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకులాల్లో నిఘా నీడలో పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 911 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 903 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ప్రత్యేక ఫ్లెయింగ్ స్క్వాడ్‌లు, విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసులు పరిశీలించారు. భీమడోలు ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఘంషూద్దీన్ పరిశీలించారు. పోలసానిపల్లికు చెందిన బాలికల పాఠశాలలోని 87 మందిని ఆర్టీసీ యాజమాన్యం భీమడోలు, డీపాల్ స్కూల్లోని పరీక్షా కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం పాఠశాలకు తీసుకెళ్లారు.

ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో నారాయణపురం ,కైకరం, ఉంగుటూరు, చేబ్రోలు, బొమ్మిడి పరీక్షా కేంద్రాల్లో 750 మంది పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. చేబ్రోలు పోలీస్టేషన్ నుంచి పరీక్ష పేపర్లను ఆయా కేంద్రాలకు కస్టోడియన్లు పోలీసుబందోబస్తుతో తీసుకువెళ్లారు. 5 సెంటర్లలో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రం

గణపవరం: మండలంలో మొత్తం 6 పరీక్షా కేంద్రాలలో 847 మంది విద్యార్థులకు గాను 25 మంది పరీక్షకు హాజరుకాలేదు. పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో ఈఏడాది సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఎంఈవో పుచ్చల శేషు, గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద గణపవరం, పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటుచేసి, అత్యవసర మందులు, ఓఆర్ఎస్‌ల్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ

పెదపాడు: పదో తరగతి విద్యార్థులకు పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ పెన్నులు పంపిణీ చేసారు, విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. పెన్నులపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి స్టిక్కర్ వేసి 265 మందికి పంపిణీ చేసారు. పెదపాడు మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, స్థానిక నాయకుడు కొత్తూరు విమలా రావు, బెన్నీ మాస్టారు పాల్గొన్నారు.

10 మంది విద్యార్థులు గైర్హాజరు

మండలంలోని 5 పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్ష ప్రసాంతంగా జరిగిందని పెదపాడు ఎంఈవో సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. 5 కేంద్రాల్లో 921 మందిలో 911మంది పరీక్షలకు హాజరయ్యారని, 10 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ సీహెచ్ బుద్దావ్యాస్ అన్నారు. మండలంలో 627 మంది తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా 11 మంది గైర్హాజరయ్యారన్నారు. దెందులూరు, కొవ్వలి, గోపన్నపాలెం ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు.

ఆరు పరీక్ష కేంద్రాల్లో..

పెదవేగి : మండల వ్యాప్తంగా పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంబమయ్యాయని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ బుద్ధవాస్ అన్నారు. పెదవేగి మండల పరిధిలోని మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో 791 మంది విద్యార్థులకు 781 మంది హజరయ్యారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎస్సై ఎం లక్ష్మణ్ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు.


కాశిపాడు పరీక్ష కేంద్రం వద్ద ప్రథమ చికిత్సా కేంద్రం


పదో తరగతి పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు


పెదవేగి హైస్కూల్ నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

12 నుంచి నాగాశ్వని అమ్మవారి ఉత్సవాలు


గాలాయగూడెంలో నాగాశ్వని అమ్మవారి ఉత్సవాలు పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

దెందులూరు: గాలాయగూడెంలో గ్రామదేవత నాగాశ్వని అమ్మవారు ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆలయ చైర్మన్ పూజారి అన్నవరం, కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు వైభవంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పూజారి శ్రీనివాసరావు, గంటా కోటేశ్వరరావు, ఏనుగు శివరామకృష్ణ, పెద్దిశెట్టి నాని, రాంబాబు, మహంకాళి, మహిళలు తదితరులున్నారు.

నేడు పూళ్లలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 4వ తేదీ మంగళవారం సాయంత్రం 3 గంటలకు వైఎస్సార్ ఆసరా పథకం బహిరంగ సభ నిర్వహించనున్నట్టు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు సోమవారం రాత్రి తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా పూళ్ల, కోడూరుపాడు, దుద్దేపూడి, కుర్లెళ్లగూడెంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను అందిస్తారన్నారు. డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడు


పాతముప్పర్రులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పెదపాడు: డాక్టరు బీఆర్ అంబేడ్కర్ దేశ ప్రజలకు ఆదర్శనీయులని డాక్టర్ వికాష్, డాక్టరు రాజ్యలక్ష్మి తెలిపారు. పాముప్పర్రులో కొండే జోషఫ్ తంబి ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బత్తుల ఏసురాజు, తంబి పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

దెందులూరు: మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా, ప్లాస్టిక్ వస్తువుల వాడకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ, కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సోమవారం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ అరసవిల్లి అరవింద్, మేనేజింగ్ ట్రస్టీ సమీర్ ఆధ్వర్యంలో గోపన్నపాలెం, వేగవరంలో మానవహారం, ర్యాలీ నిర్వహించిన ప్రజలకు అవగాహన కల్పించారు. సెట్‌వెల్ సీఈఓ మెహర్‌రాజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణ, ఏఓ టీఎస్ కరుణానిధి, డాక్టర్ ఎం .శ్రీనివాసరావు, కళాశాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులున్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించవద్దు

ఉంగుటూరు: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని మండలం బీజేపీ నాయకులు డిమాండు చేశారు. సోమవారం ఉంగుటూరు తహసీల్దారు వెంకటరమణకు దీనిపై వారు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపాశోభారాణి, మండల అధ్యక్షుడు వంజరపు దుర్గారావు, ఉపాధ్యక్షుడు కొప్పుల శ్రీనివాసరావు, మండల కార్యవర్గ సభ్యులు అడపాగణపతి, ఎస్సీ మోర్చా మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, వెంకటేష్ పాల్గొన్నారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, మనిషి ఆరోగ్యం, ఐశ్వర్యం ఆహ్లాదంగా ఉంటాడని పిరమిడ్ మాస్టర్ గారపాటి శ్రీదేవి తెలిపారు. స్థానిక సత్రంపాడు విద్యావికాస్ రోడ్డులోని హరిహర అపార్ట్‌మెంట్‌లో పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యానంపై అవగాహన కల్పించారు. అంతర్ముఖ సమారాధ్య బహిర్ముఖ సుదుర్లభ అంటే బయట ఎంత వెతికినా నేను కనబడనని, అంతర్ముఖం అయినే నేను నీలోనే ఉన్నానని పరమాత్మ తెలుపుతున్నాడని శ్రీదేవి వివరించారు. ఎవరి వయసు ఎంతో అన్ని నిమిషాలు ధ్యానం చేయడం ఫలితాలనిస్తుందన్నారు. ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస కేంద్రీకరించడమేనని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ మాజేటి శేషగిరి రావు, మాజేటి శ్యామల పాల్గొన్నారు.

వైభవంగా పవళింపు సేవ


గుండుగొలనులో పవళింపు సేవలో వివిధ పువ్వులతో స్వామికి ముస్తాబు

భీమడోలు: గుండుగొలనులోని సీతారామ స్వామి ఆలయంలో శ్రీరామనవమి కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులు పాటు నిర్వహించనున్న పవళింపు సేవా కార్యక్రమాలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లను మల్లెపువ్వులతో సుందరంగా అలకరించారు. తొలుత ఆలయంలో మంగళవాయిద్యాలు, మేళాతాళాల నడుమ కోవెల ప్రదక్షిణలు చేసారు. దర్బార్, పుష్పయాగం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు సుధీరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి దర్శించుకుని పూజలు చేసారు. గత నెల 28వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 5వ తేదీతో ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి


ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవేగి : జగనన్న కాలనీల్లో మ్యాజిక్ ఇంకుడు గుంతలు త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. సోమవారం పెదవేగి మండల పరిషత్ సమావేశ హాలులో ఇంకుడు గుంతల నిర్మాణంపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజ్‌మనోజ్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు కాబట్టి, ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు, వాడిన మురుగు రోడ్లమీదకు, పక్కవారి స్థలాల్లో మురుగు వెళ్లకుండా తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికి ఒక మ్యాజిక్ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతలకు సంబంధించిన సాంకేతిక సహకారాన్ని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అందిస్తారని చెప్పారు. ఈ ఇంకుడు గుంత పూర్తయిన తరువాత నిర్మాణ పూర్తి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రూ.5 నుంచి రూ.6 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈ ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, రోడ్ల చెంతన, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకపోవడంతో దోమలు బెడద తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ హౌసింగ్ నాగరాజు, పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం


చానమిల్లి హైస్కూలుకు కుర్చీలు అందజేస్తున్న పుప్పాల కన్నబాబు, పార్టీ నాయకులు

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు తమ వంతు సహకారం అందించాలని వైఎస్సార్ సీపీ నిడమర్రు మండల బాధ్యులు, ఎమ్మెల్యే వాసుబాబు సోదరుడు పుప్పాల కన్నబాబు అన్నారు. సోమవారం నిడమర్రు మండలం చానమిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు బువ్వనపల్లికి చెందిన అల్లుమోలు భరతన్న, అనసూయ దంపతుల జ్ఞాపకార్థం అల్లుమోలు గంగారామ్ రూ.15 వేల విలువైన 40 ప్లాస్టిక్ కుర్చీలను, చానమిల్లి గ్రామానికి చెందిన భీమాల వెంకటనర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నాగేశ్వరరావు రూ.15 వేల విలువైన ప్రింటర్ కమ్ స్కానర్‌ను బహూకరించారు. వీటిని పుప్పాల కన్నబాబు చేతులమీదుగా హెచ్ఎం ఏసుబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నంద్యాల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తల సింహాచలం, ఉపసర్పంచ్ వెజ్జు నరేష్, ఎస్ఎంసీ చైర్మన్ గరిగిపాటి హనుమంతు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గరిగిపాటి సాయిరాం పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా దాతలను పాఠశాల తరపున కన్నబాబు తదితరులు సన్మానించారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం


భీమడోలులో యోగా సర్టిఫికెట్లు అందించిన ట్రైనర్ భావనరుషి, ట్రస్టీ అరుణశ్రీ

భీమడోలు: యోగా ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతమైన శాంతిజీవనం అలవడుతుందని ఆరా ఫౌండేషన్ చైర్మన్, యోగా ట్రైనర్ భావనారుషి అన్నారు. భీమడోలులో ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన యోగా శిక్షణ తరగతులు సోమవారంతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా యోగా ట్రినర్ భావనారుషి మాట్లాడుతూ నేటి జీవన విధానంలో ప్రతి ఒక్కరూ యోగా జీవితంలో ఒక భాగం కావాలన్నారు. పరిమితమైన ఆహారంతో పాటు చక్కని యోగాసనాలను చేయడం ద్వారా శాంతియుత జీవనం అలవడుతుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి ఫౌండేషన్ ద్వారా సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ట్రైనర్, ట్రస్టీ అరుణశ్రీలను ఘనంగా సత్కరించారు.

కారు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

దెందులూరు: కారును నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్‌కు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2017 సెప్టెంబర్ 9వ తేదీ ఉదయం గంటల సమయంలో చిన్నాల సులోచన, లక్ష్మీనాంచారమ్మ, లక్ష్మి జగదీశ్వరి, కుమారి, పాణ్యశ్రీ, విజయలక్ష్మి, షణ్ముఖ, డ్రైవర్‌తో కలిసి స్వగ్రామం నుంచి స్కార్పియో వాహనంలో దెందులూరు మండలం కొవ్వలిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌కు వచ్చారు. తిరిగి అదే వాహనంలో స్వగ్రామం వెళ్లేందుకు బయలుదేరగా కుంతలకుంట చెరువు వద్దకు వచ్చేసరికి ముద్దాయి మద్యం మత్తులో అతివేగంగా నిర్లక్ష్యంగా కారు నడిపడంతో పక్కనే ఉన్న చెరువులోకి దూసుకుపోయింది. వాహనం నీటిలో మునిగిపోగా కారులో ఉన్న ఆరుగురు మృతి చెందారు. ముద్దాయి కారులో ఉన్న షణ్ముఖ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ కేసులో పలువురు సాక్షులను విచారించి ముద్దాయి పాలేటి కిరణ్ కుమార్‌కి రెండేళ్లు జైలు, రూ. 5 వేలు జరిమానా విధిస్తూ ఏలూరు వీ111 ఏడీజే కోర్టు ఎస్సీ,ఎస్టీ (పీఓఏ) యాక్ట్ కోర్టు జడ్జి ఎం. సునీల్‌కుమార్ తీర్పు చెప్పారు. కేసులో పీపీ శ్రీవాణిభాయి, డీఎస్పీ గోగుల వెంకటేశ్వరరావు దర్యాప్తు చేశారు. అప్పటి డీఎస్పీ ఈశ్వరరావు చార్జీషీటు దాఖలు చేశారు. ప్రస్తుత ఎస్సై వీర్రాజు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ వసంతరావు విచారణకు సహకరించారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

పెదపాడు: పోక్సో కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. మండలంలోని కొక్కిరపాడు గ్రామ శివారు దాసరి గూడెం ప్రాంతానికి చెందిన మానికొండ నరేష్ పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంవత్సరన్న కాలంగా అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికతో పరిచయం పెంచుకుని ఆమె గర్భానికి కారణమయ్యాడని ఫిర్యాదు అందడంతో పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసారు. దీంతో నరేష్‌ను సోమవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

పెదవేగి : అన్ని శాఖల అధికారుల సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యపడుతుందని తహసీల్దార్ ఎస్ నాగరాజు అన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ద్వాక్రా మహిళా గ్రూపులతో మండలస్థాయి అధికారులు మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారుల ఆదేశాలతో మండలస్థాయిలో ఉన్న అన్ని శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని, ఆశాఖలు అందిస్తున్న సేవలపై సమీక్షించి, అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందించే సంక్షేమ పథకాలు, వైద్య శాఖ ద్వారా పేదలకు అందించే సేవలు, పథకాలు, గృహనిర్మాణ శాఖ ద్వారా మంజూరయ్యే పథకాలు, విద్యుత్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన, ఎస్‌హెచ్‌జీ శ్రీనిధి, వంటి తదితర శాఖల అధికారులు ఆయా శాఖలపై సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, మండల సమైఖ్య ఏపీఎం బీ శరత్, మండల మెడికల్ ఆఫీసర్, ఏఈ హౌసింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బీజేపీ కన్వీనర్‌గా చైతన్య కృష్ణ

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా గుమ్మడి చైతన్య కృష్ణను నియమిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ సోమవారం లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది. చైతన్యకృష్ణ దెందులూరు మండలంలోని కొవ్వలికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకులు గారపాటి చౌదరిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా చైతన్యకృష్ణ కలిశారు.

అకాల వర్షాలకు రైతులు అధైర్యపడొద్దు


ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: అకాల వర్షాలవల్ల తగిన పంట నష్టాలపై రైతన్నలు ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే, రాష్ట్రఅధికార ప్రతినిధి, కొఠారుఅబ్బయ్యచౌదరి అన్నారు. పంట నష్టానికి పరిహారం ప్రభుత్వం అందజేస్తుందని ఆయన అన్నారు. రైతు పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటారని అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు సంక్షేమం కోసం పనిచేస్తూ ఎప్పుడు పంటకు నష్టం కలిగినా అదే సీజన్‌లో చెల్లింపులు చేస్తూ రైతన్నలందరికీ తోడుగా నిలుస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇప్పటికే దెందులూరు నియోజకవర్గంలో పొగాకు, మొక్కజొన్న వంటి పంటలకు జరిగిన నష్టాల అంచనాలను వ్యవసాయ శాఖ సిద్ధం చేసిందన్నారు. వరితో పాటు ఇతర పంటలకు సంబంధించిన లెక్కలు సిద్ధమవుతున్నాయన్నారు. రైతులు సమీప ఆర్‌బీకేలకు వెళ్లి సంబంధిత అధికారుల వద్ద పంట నష్టం వివరాలను నమోదు చేసుకునేలా అవకాశం కల్పించారన్నారు. ఆర్‌బీకేలో అధికారులను రైతులు సంప్రదించాలని ఈ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బంది కలిగినా, నేరుగా తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే వివరించారు.

పంట నష్టం వివరాల నమోదు


పెదవేగిలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పెదవేగి : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నాయని మండల వ్యవసాయశాఖాధికారిణి ఎం ప్రియాంక తెలిపారు. సోమవారం మండల పరిధిలో అకాల వర్షం కారణంగా పంట నష్ట వివరాలను నమోదు చేసుకునేందుకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మండల అధికారిణి ప్రియాంక మాట్లాడుతూ గత మార్చి 19, 20, 21 తేదీలో కురిసిన వర్షాలకు పెదకడిమి, ముండూరు, గ్రామాల్లో 78 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు గుర్తించామని చెప్పారు. అనంతరం ఏప్రిల్ 1, 2 తేదీల్లో కురిసిన వర్షానికి వంగూరు, కొప్పాక, అంకన్నగూడెం, అమ్మపాలెం, కూచింపూడి, రాయన్నపాలెం, వేగివాడ, రాట్నాలకుంట గ్రామాల్లో 315 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పంటల నష్టం జరిగిందని గుర్తించి నివేదిక తయారు చేస్తున్నామన్నారు. ఈ నివేదికను జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి అందజేస్తామన్నారు.

7 నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

నిడమర్రు: ఈనెల 7వ తేదీ నుంచి అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని ఆపార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ కోరారు. మంగళవారం ఈ కార్యక్రమానికి సంబంధించి దేవరగోపవరం, నిడమర్రు, మందలపర్రు, బువ్వనపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో నౌడు వెంకట అచ్యుతరామారావు అధ్యక్షతన గృహసారథులకు అవగాహన సదస్సులు ఆయా గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ జగనన్న మా భవిష్యత్తు అనే నినాదంతో గడపగడపకూ గృహసారథులు, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఆయా వలంటీర్లతోపాటు తప్పనిసరిగా వెళ్లాలన్నారు. జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన మెరుగైన పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి గృహసారథులే తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గున్నారు.

వృద్ధులకు 'వైఎస్సార్ కంటి వెలుగు' వరం

గణపవరం: కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. సోమవారం గణపవరం మండలం అర్ధవరం సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 60 ఏళ్ల నిండిన అవ్వాతాతలకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 65 మందికి కంటి పరీక్షలు చేసి వారందరికీ కళ్లజోళ్లు ఉచితంగా అందజేస్తామని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు, పంచాయతీ సిబ్బందితో ఆరోగ్య సదస్సు నిర్వహించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, సర్పంచ్ గాతల సుజాత, పంచాయతీ కార్యదర్శి జె.రామకృష్ణుడు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బువ్వనపల్లిలో నేడు ఆసరా చెక్కుల పంపిణీ

నిడమర్రు: వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు బువ్వనపల్లి సబ్ స్టేషన్ వద్ద గల మిర్చి యార్డులో మండలంలోని పలు గ్రామాల అక్క చెల్లెమ్మలకు ఆసరా చెక్కుల పంపిణీ ఏర్పాటు చేసినట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రామనికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా బువ్వనపల్లి, ఎనికేపల్లి, అడవికొలను, బావాయిపాలెం, చానమిల్లి, క్రొవ్విడి, సిద్దాపు రం గ్రామాలకు చెందిన 499 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రూ. 4.78 కోట్లు విలువైన చెక్కులు అందిస్తారని ఏపీఎం జి. రాజశ్రీ తెలిపారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులందరూ హాజరావ్వాలని ఆమె కోరారు.